నీడలు

ఎటువైపు చూచినా ఎంత మేరకు చూచినా ఒకటే వరసన ఎర్రని గట్టిపర్రనేల. అక్కడక్కడా ఎర్రటి గుట్టలూ, కొండలూనూ. ఒక గుట్ట ప్రక్కన చిన్న సైన్‌బోర్డు. నల్లని బోర్డుమీద చిన్న తెల్లని గుండ్రని అక్షరాలతో 'డొక్కా సీతమ్మ సత్రం' అని వ్రాసి వున్నది. ఆగుట్టవాలున చాలమంది మనుష్యులు తిరుగుతూ ఆడుతూ వున్నారు – ఆడుతూ తిరుగుతూ వున్నారు. వాళ్ళు చేస్తున్న పని – వాళ్ళ ఆట – ఏమిటంటే ఒకరి నొకరు పీక్కొని తినటం. అందరికంటే చురుకుగా తిరుగుతున్న మనిషి బక్కపలచగా నల్లగా వున్నాడు. నల్లపాంటూ ముదురు నీలంరంగు షర్టూ తొడుక్కున్నాడు. వూరికే నోరంతా తెరిచి నవ్వుతున్నాడు. నవ్వినప్పుడు తెల్లని గట్టి పలువరుసా, ఎర్రని చిగుళ్ళూ, వాని సన్నని నల్లని పొడుగాటి మొహంలో సగం మేర ఆక్రమిస్తున్నాయి. ఆ నవ్వు నవ్వుతూ ఎడం చేత్తో ఎడమప్రక్కనున్న వాడి చెయ్యి పీకి నమిలేస్తున్నాడు. కుడిచేత్తో కుడివైపు అందినవాడి పొట్ట చీలుస్తున్నాడు. అటూ యిటూ చకచకా తిరుగుతూ అందర్నీ గబగబా తినేస్తున్నాడు. వాని కదలికలు ఖచ్చితంగా వున్నాయి. వాటిలో తడబాటూ పొరపాటూ లేదు. చెయ్యి చాచాడంటే అనుకున్నది అందిందన్న మాటే. ఈ విపరీతపు గుంపుకి ఒక చివరిగా చిన్న టేబిల్ మీద చందనపు చెక్కతో చెక్కినట్లున్న ఒక చిన్నపాప కూర్చుని వున్నది. ఆ పాప మంచికళ గలిగి, లోపల్నుంచీ ఉబికివస్తున్న కాంతితో మెరుస్తున్నది. నల్లని కళ్ళతో అందర్నీ చూస్తూ వున్నది. ఉన్నట్లుండి ఆ గుంపులో కొందరు ఆ పాపను గమనించారు. ఆ పాపను

తినడానికి నవ్వుకొంటూ ఆడుకొంటూ వస్తున్నారు. అందరికంటె ముందుగా ఆ నల్లనివాడు వస్తున్నాడు. ఇహ వాడు చెయ్యి చాచితే పాప అందుతుంది. వాడు చెయ్యి చాచాడు........

నిర్మల లేచి కూర్చుంది మంచంమీద, గుండె దడదడ లాడిపోతున్నది. తాను వాడి చేతికి చిక్కిపోతానేమో నన్న విపరీతమైన భయం. ఇదంతా ఉత్త కలేనని స్థిమితపడటానికి నిర్మలకు పది నిముషాలు పట్టింది. కలలోని చిన్న పాపకీ నిర్మలకీ ఏ విషయంలోనూ పోలికల్లేవు. కాని ఆ పాప తానేనని నిర్మలకి తెలుసు. అందువలననే ఆ భయం, దడ. ఒకరి నొకరు పీక్కుతినే స్వార్థపూరితుల ప్రపంచంలోని నిర్మల ఆ పాప!

ఇహ ఆ కలలోని నల్లనివాడు, పోలికల్నిబట్టి చూస్తే నిర్మలకు ఇంట్లో పనిచేసే భాస్కరం అవడంలో సందేహంలేదు. వాడు నిర్మల భర్తయొక్క ఆఫీసులో ప్యూను. ఏ పని చెప్పినా చాల శుభ్రంగా చేస్తాడు. ఇదివరలో ఎన్నోమార్లు ఉద్యోగం పోగొట్టుకున్నవాడు గనుక ఈ సారైనా నిలుపుకుందామన్న భయం గలవాడు. అందుకే ఇంటిపనికి వేశారు. నిర్మలకు నచ్చేటంత శుభ్రంగా పనిచెయ్యగలవాళ్ళు అరుదు. వాడు ప్రతి పనినీ పూర్తిగా, శుభ్రంగా, అక్కరగా, నిదానంగా చేసుకుపోతుంటాడు. వాడి పని నిర్మలకు నచ్చింది. కాని ఎందుకో వాడంటే నిర్మలకు ఏమాత్రం సరిపడటంలేదు — నిష్కారణంగా, పొట్ట కూటికోసం పలుయాతనలు పడుతూ ఏదో ఒకవిధంగా బ్రతికేసెయ్యడమే పరమార్థంగా, ఎన్నో తరాలనుండి బ్రతుక్కుంటూ వస్తున్న జాతినుంచీ వచ్చాడు భాస్కరం. మిషనులో ఆయిలు తుడిచిపారేసినట్లుగా కన్పించే మురికి బనీనూ, అలాంటిదే చిన్నలాగూ; వాటిపైన శుభ్రంగా కన్పించే షర్టూ, పాంటూ వాడి దుస్తులు. ముగ్గురు బిడ్డలకు తండ్రి అయిన పాతి

కేళ్ళ మనిషి. ఒక్కడుగా వున్నా చాల చురుగ్గా పనిచేస్తాడు. అవతలి వాళ్ళు చెప్తున్నదాన్ని గురించి 'అవును' అనడం తప్పించి, వాడి సొంతంగా ఏ విషయాన్ని గురించి గాని మాట్లాడడు. నిశ్శబ్దంగా వుండటం వాడి స్వభావం. సులువుగా చాపక్రింది నీళ్ళలాగా ఎదుటి మనిషి ఆంతర్యంలోకి ప్రవేశించగల నేర్పు వుంది. ప్రతి మనిషినీ నడిపించేది స్వార్థజన్యమైన అవసరం అన్న జ్ఞానం కలవాడు గనుక అవతలి మనిషికి ఏది అవసరమో, ఏంచేస్తే ఆ మనిషిని మెప్పించవచ్చునో, ఏంచేస్తే కోపం వస్తుందో అన్నీ గుర్తించగలడు. వీలు చిక్కినప్పుడు తనకు తెలిసిన 'పెద్దవాళ్ళ'కు వాళ్ళు చెప్పినవీ చెప్పనివీ చిన్న పనులేవో చురుగ్గా చేసిపెడ్తూనే వుంటాడు. ప్రతి కొద్ది పరిచయమూ త్వరలోనే మూడు పువ్వులూ ఆరు కాయలుగా విస్తరించుకుపోతుంది. పాత షర్టులు, పాంట్లు, పాతపచ్చళ్ళు, పిల్లల బట్టలు, మిగిలిపోయిన అన్నం, కూరగాయలు, కూరలు, చీరలు, డబ్బాలు ఒకటేమిటి, ఎప్పుడు ఏ పరిచయంనుంచీ బ్రతకడానికి పనికొచ్చే ఏవస్తు వొచ్చిపడుతుందో భాస్కరానికే తెలియదు! ఎన్ని వచ్చినా వాడు ఇతర్ల మెప్పుకు చేస్తున్న పనికి తగినట్లుగా మాత్రం రావు! ఎందుకో గాని చాలమంది వాడు తమ జీవితంలోకి అలా పాకిరావడం, తమ అవసరాల్ని ఆంతర్యాన్ని గ్రహించడం సహించలేరు. వాడి తెలివితేటల్ని గమనించబోయి ఆగిపోతారు. తమపట్ల వాడు చూపించే అక్కరను హర్షించరు.

ఇంట్లో వేరెవ్వరూ లేనప్పుడు, నిర్మల బాత్‌రూమ్‌లో వున్నప్పుడు భాస్కరం ఆ దగ్గర్లోనే బయట కూర్చుని అప్పుడప్పుడు దగ్గటం, గొంతు సవరించుకోడం, కాండ్రించడంవంటి శబ్దాలు చేస్తుంటాడు. 'ఎవరూ లేరు గదా అని మీ యింట్లోకి పోయి సామాన్లేవీ ఎత్తుకుపోడం లేదమ్మోయ్' అన్నట్లు వినబడతాయా శబ్దాలు నిర్మలకి. ఆమె వంటగదిలో, భోజనాల గదిలో, బాత్‌రూమ్‌లో....ఎక్కడుంటే, అక్కడి తూములు

బయటినుండీ పుల్లలతో పొడిచి, గీకి శుభ్రం చేస్తాడు. 'నేను మీకోసం యీ పని చేస్తున్నాను. గమనించుకోవమ్మా' అన్నట్లుంటుంది నిర్మలకు. ఒక్కొక్కసారి నిర్మల ఏపనిలోంచీనో గబుక్కున వెనక్కి తిరిగేసరికి అక్కడ నీడలాగా నిలబడి వుంటాడు భాస్కరం – ఏదో అడగటానికి, పని చెయ్యటానికి, బ్రతికెయ్యడానికి! అనుకోని యీ దర్శనానికి నిర్మలకు భయం, కంపరం కలుగుతాయి. వాడి నిశ్శబ్దం పెద్ద శబ్దంగా ఆమె మనసులో హోరెత్తుతుంది

'వాడు బ్రతకడంకోసమే యిలా చేస్తున్నాడు. వాడు బ్రతకడానికి అవసరమైతే నా తల బ్రద్దలు కొట్టెయ్యగలడు। నన్నూ, యీ ప్రపంచాన్నీ నామరూపాలు లేకుండా చెయ్యగలడు। బ్రతుకు.... నేను! నేను.... బ్రతుకు!.... అదీ! అదే అసలు సంగతి' విసుగ్గా, కోపంగా, భయంగా, భారంగా – అనుకోకుండా అనుకుంటుంది; అనుకుంటూ అనుకోకుండా వుంటుంది నిర్మల. దానితో భాస్కరంమీద అనుమానం మరింత జాస్తి అయిపోతుంది.

నిజానికి ఆవిడ అనుమానానికి ఆస్కారం కలిగించే పని ఏదీ చెయ్యలేదు వాడు, ఇంతవరకూ. కొన్ని అబద్ధాలు చెప్పినా అది అందరూ చేసే పనే. వాడు దొంగతనం చెయ్యలేదు. ఏ దుర్మార్గమూ చెయ్యలేదు. కనీసం 'కాద'న్న సమాధానం కూడా చెప్పలేదు! అయినా కూడా వాడి మీద అనుమానం నిలిచింది నిర్మలకు.

భాస్కరమంటే నిర్మలకు సరిపడకపోవడానికి మరో కారణం వాడి నీడ. నిర్మలకి ఏ నీడలన్నా సరిపడవు. అవంటే భయం, ద్వేషం. నీడలకో చిత్రమైన గుణం వున్నది. అవి ఒకదాన్లోకి మరొకటి పాకిపోతాయి. వస్తువుయొక్క ప్రత్యేకతను కుదించివేస్తాయి. మలినం చేస్తాయి. ఏ

వస్తువులోనూ నిజం లేనట్లూ, ఎక్కడో వుండే సూర్యుడొక్కడే నిజమై లోకంలో వుండే చరచర వస్తువు లన్నిటినీ నీడలుగా మార్చి అబద్ధం చేస్తున్నట్లూ తోపింప జేస్తాయి. నిర్మలకు నీడలంటే యిష్టం లేకపోవ డానికి మరో కారణం కూడా వున్నది. తాను ఏదైనా పనిలో వున్నప్పుడు యింట్లో వుండే పనివాళ్ళు నీడల్లాగా కుడివైపుకి వెళ్ళినప్పుడు ఎడమకి వెళ్ళినట్లూ, ఎడమవైపుకి వెళ్ళినప్పుడు కుడివైపుగా వెళ్ళినట్లూ భ్రమ కలుగుతుందావిడకు. ఎదుటి మనిషిని నేరుగా చూడటం నిర్మలకు అల వాటు లేదు. వాళ్ళ నీడలే ఆమెకు కన్పించేది. ఇంట్లోకి వెళ్ళిన మనిషి ఏంచేస్తున్నాడోనని తిరిగిచూస్తే బయట ప్రక్కన కన్పిస్తాడు. బయటకు వెళ్ళిపోయాడులే, ఎక్కడో దొడ్లో వున్నాడు అనుకుని తన పనిలో తానున్నప్పుడు ఆ మనిషే ఇంట్లోంచీ బయటకు వస్తాడు! అందువలన నిర్మల చాల గొడవ పడిపోతూ వుంటుంది. భాస్కరం నీడ ఆవిణ్ణి మరీ తికమక పెడ్తుంది. తనని అలా తికమక చెయ్యడానికే ఉద్దేశపూర్వకంగా అలా చేస్తున్నాడా అనీ, పీతలాగా ప్రక్కకి నడిచే అలవాటుందేమోననీ, యింకా చాలా సందేహాలు కలిగాయి నిర్మలకు యిదివరలో. అట్లాగని ఆమెకు పనివాళ్ళందరూ దొంగ లనుకునే కుసంస్కారం లేదు. అనవస రంగా, ఋజువు లేకుండా యితర్లను అనుమానించి నిలదియ్యడం ఆవిడకు సరిపడదు. పైగా మనుష్యులందరూ సమానమేననీ. వాళ్ళకు ఆత్మ గౌరవం వుంటుందనీ, ప్రపంచమంతా పవిత్రమైనదనీ అనుకుంటుంది.

నిర్మల చిన్నపిల్లగా వున్నప్పుడు వాళ్ళనాన్నగా రొకసారి అన్నారు 'మా నిర్మలకు పేరు తగినట్లుగా కుదిరింది. నిర్మల నిర్మలే!' అని.

ఆ మాటలు నిర్మల ఎప్పుడూ మరచిపోదు. ఆమెకు తండ్రి దేవు డితో సమానం.

బాహ్యంగా నిర్మలది తల్లి పోలిక. ఇద్దరు బిడ్డల తల్లి అయిన నిర్మల కొంచెం పొట్టిగా, లావుగా, గుమ్మటంలా వుంటుంది. తల పెద్దది. పెద్దమొహంలో కళ్ళూ ముక్కూ నోరూ ఆ పెద్ద తలకీ శరీరానికీ చెంది నవి కానట్లు నాజూగ్గా వుంటాయి. పనిచేసుకుంటున్నప్పుడు నిండుదనం నిబ్బరం లేనట్లుగా ఎవరో తరుముకొస్తున్నట్లు పరుగెత్తుతూ పనులు చేసు కుంటుంది. అందువలన ఆమెకున్న ముప్పై ఏళ్ళ వయసుకంటే చిన్న దిగా అనిపిస్తుంది. బట్టలు శుభ్రంగా వుంటాయి గాని అశ్రద్ధగా నాజూకు లేకుండా కట్టుకుంటుంది.

పై పోలిక తల్లిదే అయినా ఇద్దరి స్వభావాలూ పూర్తిగా భిన్నంగా వుంటాయి. చిన్నప్పట్నుంచీ నిర్మలకు తల్లి గురించి సదభిప్రాయంలేదు. ఆవిడ చదువుకోలేదు. నాగరకతలేదు. దేని గురించీ సరైన 'దృక్పథం' లేదు. తన సంసారం, దాని బాగోగులూ తప్పించి ప్రపంచంలో ముఖ్య మైనదేమీ లేదావిడకు. ఎదుటివాళ్ళూ మనుష్యులేనన్న గుర్తింపు ఏమాత్రం లేదు. ఇతరులపట్ల, ముఖ్యంగా క్రింద పనిచేసేవాళ్ళ పట్ల, చాల అన్యాయంగా ప్రవర్తిస్తుందని నిర్మల ఉద్దేశ్యం. పని సరిగ్గా చెయ్యలేదని ఎప్పుడూ వాళ్ళని కేకలేస్తూనే వుండేది. ఏదైనా వస్తువు కన్పించనప్పుడు ఏ ఋజువూ లేకుండానే వాళ్ళని దొంగలైనట్లు నిలదీసేది. ఒక్కొసారి ఆ వస్తువు ఇంట్లోనే ఏమూలనో దర్శన మిచ్చేది. అప్పటికి నిజంగా ఏమీ ఎరగనివాళ్ళని దొంగలని ఆరోపించినట్లే కదా. ఆ వస్తువు నిజంగా పోయినప్పుడు కూడా ప్రశ్నించబడ్డ నలుగురు మనుష్యుల్లోనూ నిజానికి దొంగ ఒకడే వుంటాడు. మిగతా ముగ్గురూ నిర్దోషులే కదా. ఋజువు లేకుండానే ఎవర్నయినా ఏమైనా అనడం తగని పని, అన్యాయం, మహా

పాపం. ఒక చిన్నవస్తువుకోసం ఇతర్లను దొంగలుగా నిలబెట్టడం నిర్మలకు సరిపడదు. వెధవ వస్తువు మనిషికంటే ఎక్కువా? అనుకుంటుంది. అటువంటి సమయాల్లో తల్లిమీద విరుచుకుపడేది. తండ్రి ఎప్పుడూ పూర్తిగా నిర్మలని సమర్థించే వాడు. ఇటువంటి ఋజువర్తనం, సాంఘిక న్యాయం, ఉన్నతాదర్శాలూ తలడ్రీ కూతుళ్ళ మధ్యన గట్టిబంధంగా వుండేవి. దేవుడు వచ్చి 'ఇది నీ ఆఖరి క్షణం. వచ్చే జన్మకు నీకేం కావాలో కోరుకో' అని అడిగితే, తక్షణం అడిగినా, ఏడాది ఆలోచించుకొని అడిగినా, నిర్మల ఒకటే అడుగుతుంది. 'మలినం అంటని మనసు, నిర్మలమైన జీవితం గల నిర్మలగానే పుట్టించు' అని.

కాని సంసార బాధ్యతలు పైన పడ్డాక నిర్మలకు పరీక్ష ప్రారంభమైంది.

జీవితం ఆదర్శాల మేరకు నడవడం కష్టమౌతోంది. తన యింట్లో వస్తువు పోయినప్పుడు ఏంచెయ్యాలి? అన్నది కొరుకుడు పడటంలేదు. ఇతర్లని ఋజువు లేకుండా అనుమానించడం ఆవిడ కిష్టంలేదు. కాని వస్తువులు పోగొట్టుకోవడమూ యిష్టంలేదు. ఇదివరకు పుట్టింట్లో వున్నప్పటి వస్తువుల్లాగా కాకుండా ఇక్కడివన్నీ ముఖ్యమైన వస్తువులు! ఏ వస్తువుగాని పోతే పోతుందిలే అనుకోడానికి వీల్లేకుండా వున్నది. వాటిని కాపాడుకోడానికి అవతలి మనుషుల్ని వూరికే అనుమానించడం తప్పు. ఏం చెయ్యాలో తోచక ఆవిడ ప్రపంచాన్ని 'చూడకుండా' వుండటం నేర్చుకున్నది. చూడని విషయాలకు బాధపడాల్సిన అవసరం లేదు!

ఈ పరిస్థితుల్లో ఆవిడలో మరో మనసురూపు కట్టి వేరుగా వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకున్నది. ఆవిడ గమనించని వెన్నో అది గమనిస్తుంది. అర్థం చేసుకుంటుంది. ఆ రెండో మనసుతో తన కేమీ సంబంధం లేదని

నిర్మల అనుకున్నా, దాని అభిప్రాయాలు ఆవిణ్ణి కలవరపరుస్తాయి. అందువలన ఎన్నో విషయాలు ఆమె మనసులో నీడల్లాగా నిజం కాకుండా అబద్ధం కాకుండా వుంటాయి.

ఆ క్రితం రోజు బాత్‌రూమ్‌లో వుండే స్టీలు చెంబు మాయమై పోయింది. ఎట్లా పోయిందీ, ఎవరు తీసిందీ అచూకీ తెలియలేదు. ఆమె ఆలోచనల్లోంచీ ఆవిడ మనసులో ఒక నీడ మెదిలింది. వస్తువు పోయిన రోజు మధ్యాహ్నం కొత్త పనిమనిషి చంద్ర బాత్‌రూమ్‌లో తచ్చాడుతూం డటం, అటు వెళ్తూ నిర్మల చూచింది. నిర్మలను చూడగానే తడబడి, బకెట్‌లోంచీ నీళ్ళు తీసి తూము దగ్గర శుభ్రం చెయ్యా నారంభించింది చంద్ర. 'ఈ సమయంలో అది తూములు కడగదే. ఇప్పుడు ఇక్కడ ఎందుకున్నది?' అని నిర్మల ప్రశ్నించుకోలేదు. దాన్ని అడగలేదు. ఆ విషయమే 'చూడకుండా' వెళ్ళిపోయింది. అందువలన ఆ సమయంలో చంద్ర అక్కడున్న విషయం ఆవిడకు ఖచ్చితంగా జ్ఞాపకంలేదు. జ్ఞాప కపు నీడలాగా వున్నది. చంద్ర అప్పుడు అక్కడ కన్పించిందా అంటే కన్పించినట్లే వున్నది. లేదా అంటే ఏమో గుర్తు లేదు! చెంబు ఏమైంది? చంద్ర తీసిందా? భాస్కరం తీశాడా? వేరెవరూ అక్కడికి వెళ్ళరే! చెంబు కన్పించలేదని గుర్తించినా దాని విషయం ఇంతవరకూ ఎవర్నీ అడగలేదు. ఎవర్నని అడగటం? ఏదీ స్పష్టంగా తెలియడం లేదే!

దాని విషయమై క్రితం రోజు మనసులో చాల బాధపడింది. స్టీలు చెంబు విలువ ఇరవై రూపాయిలే గదా. ఇరవై రూపాయిలకోసం ఎందు కింత బాధ పడాలి? పుట్టింట్లో వున్నప్పుడు ఇటువంటి వాటికోసం — వస్తువులకోసం — యింత బాధ కలగలేదు. ఆ వస్తువులు ఎలా వచ్చాయి, ఎందుకు వచ్చాయి అన్న ఆలోచనే రాలేదు అప్పుడు. వెధవ స్టీలుచెంబు,

యాభై రూపాయలు పోయింది!

'నేను చంద్రను పట్టుకొస్తాను' అంటూనే పరుగెత్తాడు భాస్కరం.

వరుసగా జరుగుతున్న దొంగతనాలకు నిర్మలకు మతిపోయింది.

సగందారిలో పోతున్న చంద్రను వెనక్కు పిల్చుకొచ్చాడు భాస్కరం. 'ఆ డబ్బు నాకేం తెల్సు' అంటూ మూలకుపోయి బట్టలువిప్పి విదిలించి నిర్మలకు చూపించింది చంద్ర. దాని దుబ్బు జుట్టులో దాచేసుకొని వుండునా! అన్న అనుమానం లీలగా మెదిలింది నిర్మల మనసులో. కాని 'నీ జుట్టు ముడివిప్పి చూపించు' అని అడగలేక, చంద్ర వెళ్ళిపోతుంటే అనుమానంగా చూస్తూ వూరుకుంది.

తరువాత అయిదు నిముషాల్లో మడతగా పెట్టిన అయిదు పది రూపాయల నోట్లు తెచ్చి నిర్మల చేతిలో పెట్టాడు భాస్కరం! చంద్రను పిలుచుకొని వస్తూండగా దారిలో ఒకచోట చెట్టుచాటుకు వెళ్ళిందట చంద్ర. అది యిక్కడ బట్టలువిప్పి చూపించేలోగా భాస్కరం తిరిగివెళ్ళి ఆ చెట్టు చాటున చూస్తే యీ మడుపు దొరికింది! 'ఇటువంటి దొంగముండల వల్లనే మా వుద్యోగాలు పొయ్యేది!' అని తిరిగి వెళ్తున్న దాని మొహం మీద వూసివచ్చానని చెప్పాడు వీరుడి పోజులో.

మరో పదిహేను నిమిషాల్లో చంద్ర వచ్చింది, బంధుబలగంతో సహా. 'మీ చెంబులూ, మీ డబ్బులూ నాకేం తెల్సు! మీ యింట్లో తిరిగేది నేనొక్కదాన్నే కాదుగా, ఎవరు తీశారో! మీ యింట్లో నేను పని చెయ్యను' అన్నది.

భాస్కరం నిశ్శబ్దంగా చూస్తూ నిలబడ్డాడు.

ఇంతకుముందే దాన్ని తిట్టి మొహంమీద వూసిన మనిషేనా! అనుకుంది నిర్మల కోపంగా.

ఇంటి వెనుక నిల్చున్న భాస్కరంతో కాసేపు మాట్లాడి బయటికి వెళ్ళి నిల్చుంది చంద్ర.

'అది జీతంకోసమే వచ్చిందమ్మగారూ' అన్నాడు భాస్కరం వచ్చి.

చంద్రను వెనక్కు పిలిచి డబ్బిచ్చి పంపింది నిర్మల. చంద్ర భాస్కరంతో మాట్లాడడంగాని, వాడు దానికి జీతం యిప్పించడంగాని నిర్మలకు అర్థం కాలేదు జరిగినదాని దృష్ట్యా. వాడు నిజంగా మంచివాడే అయితే దొంగదానితో ఎందుకు మాట్లాడుతాడు? మంచీ, చెడ్డా కలవటానికి వీల్లేదే! వాడిమీద అనుమానం, అన్నింటికీ వాడే కారణమన్న అనుమానం, పెద్దదై పోయింది.

ఆవిడలోని మరో మనసు 'కోటు జేబులోంచీ డబ్బు పోయిందని వాడికెట్లా తెలిసిందీ?' అంటూ ప్రశ్నలేసింది.

'ఋజువు లేకపోయినా వాడూ దొంగే! దొంగతనంలో భాగస్తుడే.'

'దొంగని పట్టడానికి దొంగే కావాలి.'

'యీ దొంగతనం వాడు చెయ్యకున్నా దాని దొంగబుద్ధే వాడిలోనూ వున్నది కనుకనే దాన్ని కనిపెట్టాడు.'

అన్నీ అనేస్తోంది ఆ మరో మనసు.

అప్పుడు నిర్మలకో భయంకరమైన సందేహం వచ్చింది.

'ఈ దొంగతనం చంద్ర చేసిందని ఋజువైంది. వాడు దొంగతనం చెయ్యలేదు. అయినా వాడిది దొంగబుద్ధి అని నేను ఎలా కనిపెట్టాను? దేనితో కనిపెట్టాను?' అని.

'ఛీ! అటువంటి క్షుద్రునితో నాకేం పోలిక! వెధవ స్టీలుచెంబు కోసం ఏమిటీ గొడవంతా?' అని మనసును శాంతపరచుకోబోయింది.

మనిషికి ఆలోచనలనేవి ఎక్కణ్ణుంచీ వస్తున్నవి?

ఈ ప్రపంచంలో బ్రతికే మనిషి 'మనసా' నిర్మలంగా వుండటం సాధ్యమా?

ఆ మనసులోనికి ప్రసరించే నీడలకు కారణం ఏమిటి?

అల్పమైన వస్తువులకు విలువ ఎక్కణ్ణుంచి వస్తోంది?

మనిషికీ ప్రపంచానికీ వుండే సంబంధం ఎలాంటిది?

ఎన్నో ప్రశ్నలతో సతమతమై, మనసుకు మూలం ఎక్కడుందో అక్కడివరకూ వెళ్ళి, దాన్ని అందుకోలేకపోయింది నిర్మల!